# వేలం పాట

## శ్రీరాజ్




"యువర్ ఎటెన్షన్ ప్లీజ్, నెంబర్ ట్వంటీ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఫ్రం సికిందరాబాద్ టు భువనేశ్వర్ ఈజ్ ఎరయివింగ్ యిన్ ఎ ఫ్యూ మినిట్స్ ఆన్ ప్లాట్ ఫారం నంబర్ వన్" మైక్‌లో ఎనౌన్సర్ గొంతు వినబడగానే నా ఎయిర్ బాగ్ తీసుకొని భుజానికి తగిలించుకొని లేచి నిలబడ్డాను.

మిగతా రెండు భాషల్లో కూడా ఎనౌన్సర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గురించి చెప్పుకుపోతున్నది.

జనరల్ కంపార్టుమెంట్ ఎక్కడకొచ్చి ఆగుతుందో ఊహించుకుంటూ ప్లాట్‌ఫారం చివరకు నడవసాగాను.

కొద్ది దూరంలో ట్రయిన్ హెడ్ లైట్ కనిపించింది. మెల్లగా వచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది కోణార్క్ ఎక్స్‌ప్రెస్.

నాతోపాటు అక్కడ జనరల్ కంపార్టుమెంటులో ఎక్కడానికి యింకో అయిదారుగురు ఉన్నారు.

అక్కడ దిగేవాళ్ళను సొంతం దిగనీయకుండానే కింద ఉన్న వాళ్ళు నెట్టుకుంటూ ఎక్కసాగారు. వాళ్ళతో పాటు నేను ఎక్కాను. లోపల సీట్లన్నీ దాదాపు ఖాళీగానే ఉన్నాయి. లోపల ఒక పది, పదిహేను మంది కంటే ఎక్కువ మంది లేరు.

విండో సైడ్ సింగిల్ సీటు ఒకటి ఖాళీగా కనిపిస్తే గభాల్న వెళ్ళి దాంట్లో కూర్చున్నాను. భుజానికి తగిలించుకొన్న ఎయిర్ బాగ్‌ని తీసి నా ప్రక్కనే సీటు మీద పెట్టుకుని కూర్చున్నాను.

ట్రయిన్ బయలు దేరింది. జేబులోంచి సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె తీసి సిగరెట్ వెలిగించుకొని గట్టిగా ఒక దమ్ము లాగాను. రోజూ కిట కిట లాడుతూ వచ్చే ట్రయిన్ ఈ రోజు యింత ఖాళీగా రావడం నా అదృష్టం అని సంతోష పడుతూ రిలాక్స్‌డ్‌గా కాళ్ళు జాపుకొని కూర్చున్నాను.

కిటికీలోంచి బయటకు చూసాను. ట్రయిన్ ఏలూరు టవున్ దాటింది. బయట అంతా కటిక చీకటిగా వున్నది. దూరంగా వెనక్కి తిరిగి చూస్తే ఏలూరు టవున్ లైట్లు కనిపిస్తున్నాయి.

ఇంతలో—

"ఆఁ! చూడండి సార్. యిది మాయ కాదు. వేలం పాట పేరుతో నకిలీ బట్టలు అమ్మేవాళ్ళం కాదు. మా దగ్గర ఒరిజినల్ జపాన్ పాంటు బిట్స్, షర్టు బిట్స్ కొద్దిగా ఉన్నాయి. తిరిగి వెళ్ళిపోతూ యివి ఈ ట్రయిన్‌లో సొమ్ము చేసుకుని పోదామనుకున్నాము. 'బిట్'ని పరీక్ష చేసిన తర్వాతనే పాటలో పాల్గొనవచ్చు. అందరి లాగా పాట గిట్టుబాటు కాలేదని దువ్వెనలు, సబ్బు పెట్టెలు యిచ్చి వెళ్ళిపోయేవాళ్ళం కాదు. ఇప్పటి దాకా ఊళ్ళో కొన్ని అమ్మాం. యింకో నాలుగు పాంట్లు, రెండు షర్టు బిట్స్ మిగిలిపోయాయి.

మీకూ ఒక గంట దాకా టైం పాస్ అయినట్లుంటుంది మాకూ వ్యాపారం చేసుకొన్నట్లుంటుంది. ముందు బట్ట నాణ్యత చూసుకోండి" అని పాంటు బిట్ మడత విప్పి ఒక్కసారి విదిలించి పొడుగు సీట్లలో కూర్చొన్న పాసింజర్స్ మీదకు విసిరాడు. అతను బట్ట మడత విప్పగానే మంచి సెంటు వాసన కూడా ముక్కు పుటాలను తాకింది.

వెంటనే నాకు యిది వరకు జరిగిన సంఘటన ఒకటి జ్ఞాపకం వచ్చింది.

యిలాగే రైలులో వేలం పాట పెట్టి నాసిరకం గుడ్డలు వేలం వేసేవాళ్ళు. అప్పుడు నాకు వీటి సంగతి తెలియక అరవై రూపాయలు పెట్టి ఒక పాంట్ బిట్ వేలంలో పాడాను. చాలా చౌకలో వచ్చిందన్న ఆనందంతో యింటి కెళ్ళి దగ్గరలో ఉన్న టైలర్‌కు యిచ్చాను కుట్టమని. అతను పాంటు గుడ్డని అటు యిటూ తిప్పిచూసి. "ఎక్కడ కొన్నారు బాబూ, మీరు ఈ గుడ్డని" అని అడిగాడు.

**కంపార్ట్‌మెంట్ అంతా కోలాహలంగా ఉంది. కళ్ళు నులుముకుని చూశాను. రైల్వే పోలీసులు కూడా ఉన్నారు. ఈ డాక్టర్ని, పోలీసుల్ని చూడగానే అప్పటికి జరిగిందేమిటో కొద్దిగా కొద్దిగా జ్ఞాపకంవస్తూంది.**

టైలర్‌కి గుడ్డ బాగా నచ్చిందేమో అందుకనే అడుగుతున్నాడనుకొని "మొన్న విజయవాడ వెళ్లాను కదా అక్కడకొన్నా" అని చెప్పాను గర్వంగా.

"బాబూ ఈ గుడ్డకి కుట్టుకూలి కూడా దండగే" అన్నాడు టైలర్. నాకు ఒక్కసారి కళ్ళు తిరిగినట్లనిపించి "ఏం ఏమయింది దానికి." అన్నాను?

"ఇది డూప్లికేట్. ఒక్కసారి నీళ్ళలో ముంచి లేపితే తరువాత మీరు లోపల తొడుక్కునే డ్రాయర్‌కు కూడ పనిచేయదు" అన్నాడు. టైలర్ నిజం చెపుతున్నాడో, అబద్ధం చెపుతున్నాడో నాకర్థం కావడంలేదు.

"నిజంగా యిది డూప్లికేట్" అన్నాను అనుమానం తీరక.

"అవును సార్ యిది డూప్లికేట్. మీ యింట్లో టేబిల్ ఉంటే టేబిల్ క్లాత్‌గా వాడుకోండి. లేదంటే డోర్ కర్టన్‌గా వాడండి."

నాకు చాలా అవమానమనిపించింది.

"మీరు తెలిసిన వాళ్ళుకాబట్టి కుట్టుకూలికి ఆశపడకుండా నిజం చెప్పేశాను. తీసుకెళ్ళండి బాబూ తీసుకెళ్ళండి" అని మడతపెట్టి భద్రంగా నా కిచ్చేశాడు.

ఆ గుడ్డ తీసుకుని తిరుగుముఖం పట్టాను.

నా కెందుకో టైలర్ మాటలు నమ్మబుద్ధికాలేదు.

గుడ్డ బాగుండలేదంటే ఏదో ఒకరేటుకి అతనికే యిచ్చేస్తానని అలా చెప్పాడేమో. అయినా ఎందుకు-యింటికి వెళ్ళి నీళ్ళలో తడిపి ఆరేస్తే తెలుస్తుందిగా' అనుకొని వెంటనే యింటికెళ్ళి ఆ గుడ్డను తడిపి కాసేపు వుంచి పైకి లేపాను.

నిజంగానే కళ్ళు తిరిగాయి నాకు.

బకెట్టులో రంగు నీళ్ళు పోసినట్టుగా వుంది.

నిజంగా ఇది డూప్లికేట్ అన్న అనుమానం రాసాగింది. తరువాత అట్లాగే దాన్ని తీసుకెళ్ళి ఆరేశాను. ఆరిన తరువాత చూస్తే రంగు వెలిసిపోయిన పాతగుడ్డలాగా ముడుచుపోయింది. అది చూడగానే కళ్ళమ్మట నీళ్ళు రాలేదుగాని ఏడ్చినంత పనయింది. ఆ రోజు భోజనం కూడా సహించలేదు. మోసపోయానే అన్న బాధతో.

ఇప్పుడు నేను అలా మోసపోయేందుకు ఛాన్సులేదు. ఎందుకంటే, దాదాపు సంవత్సరం నుంచీ బట్టల వ్యాపారం చేస్తున్నాను. ఏలూరులోనే చిన్న కొట్టుగది అద్దెకుతీసుకొని బట్టల కొట్టు పెట్టాను. ఖర్చుకి లోటు లేకుండా జరిగిపోతుంది. కొట్టు మీద వచ్చే ఆదాయంతో.

ఇప్పుడు నాకు గుడ్డలలో నాణ్యత బాగా తెలుసు. ఏది మంచో, ఏది చెడో ఈ సంవత్సర కాలంలో బాగా తెలుసుకొన్నాను.

ఇప్పుడు నేను రాజమండ్రి అందుకే వెళుతున్నాను. అక్కడ నా ఫ్రెండొకడిది హోల్‌సేల్ బట్టల కొట్టుఉన్నది. అక్కడ కొనుక్కొచ్చే యిక్కడ నేను వ్యాపారం చేస్తున్నాను. యిప్పుడు కూడా కొనుగోలుగురించే బయలుదేరాను.

నా ఆలోచనలు భంగంచేస్తూ వేలంపాట అతను పాంటు బిట్ నామీదకు విసిరాడు "చూడండి సార్, క్లాత్ ఒరిజినలో, కాదో" అని.

పాత అనుభవం జ్ఞాపకమొచ్చి యితన్ని ముఖం మీదనే దులిపేద్దామనుకొన్నాను. కాని అతను నా కిచ్చిన పాంటును చూడగానే ఆశ్చర్యం వేసింది.

ఇది నిజంగానే ఇంపోర్టెడ్ క్లాత్. నకిలీది కాదు. అతను నా చేతిలోంచి గుడ్డను తీసుకొని వెనక్కి వెళ్ళిపోయాడు.

"ఆఁ! ఇప్పుడు కొద్దిగా పద్ధతి మార్చి వుంటారు. ముందు ఒకటి, రెండు మంచి గుడ్డలు చూపించి తరువాత "అసలైనవి" గుడ్డలను వేలం వేస్తారు. అందర్నీ పిచ్చోళ్ళ క్రింద జమకడుతున్నారేమో పాపం! చూద్దాం ఏం జరుగుతుందో.

"ఆఁ! చూశారుగా సార్, దీన్లో మోసం ఏమీ లేదు. మీకు నచ్చితేనే పాడండి' అని కొద్దిసేపాగి—

"కంపెనీ వారి పాట పది రూపాయలు" అన్నాడు.

ఒక్క నిమిషం నిశ్శబ్దం అయింది.

"పదిహేను రూపాయలు" అన్నాడెవరో.

"ఇరవై" అన్నారు ఇంకొకరు.

"పాతిక."

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

"పాతిక .... పాతిక రూపాయలు...." అంటున్నాడు వేలం అతను.

"ముప్ఫై రూపాయలు" మళ్ళీ మొదలయింది.

"నలభై రూపాయలు."

"అరవై రూపాయలు."

పాట పెరుగుతున్నది.

"డెబ్భై రూపాయలు."

"డెబ్భై అయిదు' ఆ తరువాత యింకెవరూ పాడలేదు.

"డెబ్భై అయిదు- ఒకటో సారి...."

"డెబ్భై అయిదు- రెండవ సారి.."

"డెబ్భై అయిదు- మూడవ సారి....' పాట కొట్టేశాడు.

"చూసారా సార్? ఈ క్లాత్ డెబ్భై అయిదు రూపాయలంటే నాకు నిజంగా లాస్. అయినా సరే యిచ్చేస్తున్నాను" అని మడతపెట్టి పాడుతున్న అతనికి యిచ్చేశాడు.

'ఫరవాలేదు బయట కొంటే నూట యిరవై రూపాయలు. చాలా చౌకలో కొట్టేశాడు అదృష్టవంతుడు' అనుకొన్నాను.

ఈసారి 'అసలైన' గుడ్డ తీసుకున్నాను.

అతని వంకే చూడసాగాను.

సూట్‌కేస్‌లోంచి యింకో గుడ్డ తీసాడు. గుడ్డ బయటకు తీయగానే మళ్ళీ సెంట్ వాసన వచ్చింది.

మళ్ళీ అందరికీ చూపించాడు.

యిదికూడా మంచిదే. అనుమానం లేదు.

మళ్ళీ పాట మొదలయింది.

ఈ సారి ఎనభై అయిదుకు యింకొకతను పాడాడు.

యిందాకటి పాంటుకంటే యిది యింకా బాగుంది. అందుకనే పది రూపాయలు ఎక్కువకు పోయింది.

అట్లా ఒకటి తర్వాత ఒకటి వేలం వేస్తున్నాడు.

అన్నీ మంచి గుడ్డలే. మరి ఎక్కడ మోసం చేస్తాడో నాకు అర్థం కావటం లేదు. నిజానికి ఇప్పుడు వేలం వేసిన బట్టలమీద అతనికి నష్టమే. మరి నష్టానికి ఎందుకిస్తున్నాడు? ఒకవేళ దొంగ సరుకేమో! ఊహూఁ! దొంగ సరుకైతే ధైర్యంగా యింత బాహాటంగా వేలంవేయడు. సీక్రెట్టుగా ఎక్కడన్నా అమ్ముకుంటాడు.

మళ్ళీ అతని గొంతు వినిపించింది.

"సార్, పాంట్ బిట్లు అయిపోయాయి. యింక షర్ట్ బిట్స్ మాత్రమే ఉన్నాయి. అవికూడ నా దగ్గర రెండే ఉన్నాయి. మరి వాటి అదృష్టవంతులెవరో," అని షర్టుగుడ్డ బయటకు తీశాడు.

వెంటనే మళ్ళీ సెంటు వాసన వచ్చింది.

'ఆ సూట్‌కేస్‌లో సెంట్ బాటిల్స్ కూడ ఉన్నాయేమో' అనుకున్నాను. షర్టు గుడ్డ మడత విప్పి అందరికీ చూపిస్తూ వస్తున్నాడు.

అందరూ ఆశగా దానివంకే చూస్తున్నారు.

నా దగ్గరకు కూడ వచ్చాడు. గుడ్డని చూడగానే తెలిసిపోయింది. అది జపాన్ సిల్క్. బయట మార్కెట్‌లో మీటర్ డెబ్భైయి రూపాయలదాకా ఉన్నది.

అతను మళ్ళీ తన ప్లేస్‌లోకి వెళ్ళి "సార్, యిది జపాన్

సిల్క్ రెండు మీటర్లు ఫుల్ హాండ్స్ అవుతుంది. అని అందరి వంకా ఒకసారి చూసి "కంపెనీ పాడి పాట పాతిక రూపాయలు" అన్నాడు.

వెంటనే ఎవరో "నలభై రూపాయలు" అన్నారు.

ఆ వెంటనే "అరవై" అన్నారింకొకరు.

నాకు కూడా పాడాలనిపించింది. "డెబ్భై" అన్నాను.

"ఎనభై" యింకొకరు.

"వంద" అన్నారింకొకతను.

పాట పెరిగిపోతున్నది.

నాకు ఊపువచ్చేసింది. "నూట పది" అన్నాను.

"నూట యిరవై."

యింక లాభం లేదనుకొని ఆగిపోయాను.

నూట యిరవైకి పాట కొట్టేశాడు.

"లాస్ట్ అండ్ ఫైనల్ బిట్ సార్" అంటూ సూట్‌కేస్ లోంచి షర్టు బిట్ తీసి అందరి మీదకు విసరసాగాడు చూసుకోండి అని.

ఈసారి సెంటువాసన ముక్కుపుటాలను బద్దలుకొడుతూంది. అందరూ చేతులలో పట్టుకొని చూడసాగారు.

ఆ గుడ్డ మీదనుంచి వచ్చే సెంటు వాసనకు మైమరచిపోయి ముక్కుకు దగరగా పెట్టి దాని వాసనను చూడసాగారు.

అందులో ఒకతను ఉండబట్టలేక "నువు సెంట్‌బాటిల్స్ కూడా అమ్ముతావా?" అడిగాడు.

"అవునండి – యింపోర్టెడ్ సెంట్లు కూడ అమ్ముతాను. కాని యిప్పుడు అయిపోయాయి. చిన్న శాంపిల్ బాటిల్ మటుకుంది. దాన్లోని సెంటే కొద్దిగా ఈ బట్టలమీద ఒలికింది. ఈ షర్టు గుడ్డని పాడుకొన్నవాళ్ళకి అది ఫ్రీగా యిచ్చేస్తాను" అన్నాడు.

అప్పటిదాకా డోర్సుదగ్గర నిలబడ్డ వ్యక్తులు అతని దగ్గరకు వచ్చి అతని పక్కనే నడవసాగారు.

అతనిచ్చిన గుడ్డ పట్టుకు చూసాను. చాలా మెత్తగా ఉంది– క్రీమ్ కలర్.

ఆ క్లాత్‌లోంచి వస్తున్న వాసన చూసి ఆటోమేటిగ్గా ఈ సెంటు బాగుంది యిది నూట నలభై అయినా సరే పాడాలనిపించింది ఆ సెంట్ బాటిల్ గురించి. ఆ సెంటు వాసనలో కలిసిపోయి ఏదో తియ్యటి వాసన మత్తుగా వస్తున్నది. అప్పటిదాకా మైళ్ళదూరంలో ఉన్న నిద్ర వెంటనే ఆవహించింది. వచ్చేది తాడేపల్లిగూడెం. అక్కడ లేతాగాలి అనుకుంటుండగానే కళ్ళుమూతలు పడసాగాయి. బలవంతాన తెరుద్దామనుకొన్నా తెరుచుకోవడంలేదు.

* * *

కళ్ళు తెరిచాను.

ఎదురుగా తెల్లటి యూనిఫారంలో ఉన్న డాక్టర్ నా మీదకువంగి చూస్తున్నాడు. నేన తనివంక చూడగానే అతను అక్కడనుంచి కదిలి నిద్రపోతున్న యింకొకతని దగ్గర కెళ్ళి ముక్కుదగ్గర ఏదో పెట్టి చూపిస్తున్నాడు.

కంపార్ట్‌మెంట్ అంతా కోలాహలంగా ఉంది. కళ్ళునులుముకుని చూశాను. రైల్వే పోలీసులు కూడా ఉన్నారు. ఈ డాక్టర్నీ, పోలీసుల్నీ చూడగానే అప్పటికి జరిగిందేమిటో కొద్దిగా కొద్దిగా జ్ఞాపకంవస్తూ, ఏం జరిగిందో అర్థమయింది.

వెంటనే బ్యాగ్ చూసుకొన్నాను. బ్యాగ్ నా దగ్గరే ఉన్నది. కాని.... కాని.... బట్టలు కొందామని ఉంచిన నాలుగు వేలు లేవు!!!

మిగతావాళ్ళకు కూడా తెలివి వచ్చింది.

తెలివొచ్చాక అందరూ గగ్గోలు పెట్టేసారు.

ఒకడు నా వాచీ పోయిందంటే ఇంకొకడు నా జేబులో ఉన్న డబ్బులు పోయాయని....

"అయ్యో నేను వేలంపాటలో కొన్న షర్టుకూడా పోయిందని" ఇంకో నిర్భాగ్యుడు.

"అందరూ ట్రయిన్ దిగివచ్చి ఏమేం పోయాయో కంప్లెయింట్ వ్రాసియివ్వండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అందరివంకా చూస్తూ.

"దొంగ దొరికాడా సార్" అన్నారెవరో

"లేదు ఇక్కడ దొంగతనం జరిగిందని ఇప్పుడేగా తెలిసింది. ఇక్కడ ఎక్కిన పాసింజర్లు, మీరందరూ, కొంతమంది కిందా, కొంతమంది బల్లల మీదా, ఇంకొంతమంది ఒకళ్ళమీద ఒకళ్ళు పడి నిద్రపోతుంటే, వాళ్ళకు అర్థంకాక అసలు బ్రతికున్నారో లేదోనన్న అనుమానమొచ్చి మాకు చెప్పారు. తీరా మేమొచ్చిచూస్తే ఇదీ పరిస్థితి" అని దిగి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

'అదృష్టం బాగుంటే తప్ప పోయిన డబ్బు దొరకదు' అనుకొంటూ అందరితోపాటు నేను కిందకు దిగి పోలీస్ స్టేషన్‌వైపు నడిచాను. *

